‘వైఎస్సార్ ఆసరా’తో
అక్కచెల్లెమ్మలకు మేలు

- మహిళా సంక్షేమానికి జగనన్న పెద్దపీట
- ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్
- 989 డ్వాక్రా సంఘాలకు రూ.7.67 కోట్ల ఆసరా చెక్కు పంపిణీ


సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా సంఘాల మహిళలు


డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కొనియాడారు. మున్సిపల్ స్టేడియం ఆవరణలో బుధవారం నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 989 డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడతలో మంజూరైన రూ.7.67 కోట్ల చెక్కును పంపిణీ చేశారు. సీఎం జగన్ చిత్రపటానికి డ్వాక్రా మహిళలతో కలిసి ఆయన క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ పాదయాత్రలో జగనన్న ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలో నాలుగు విడతల్లో 56 వేల మంది రూ.160 కోట్ల డ్వాక్రా రుణాలను మాఫీ చేశామన్నారు. వైఎస్సార్ ఆసరా ద్వారా అక్కచెల్లెమ్మలకు ఆర్థికంగా ఎంతో మేలు జరిగిందన్నారు. రుణమాఫీ చేస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు డ్వాక్రా మహిళలు, రైతులను మోసం చేశారన్నారు. ఆయన మాయమాటల్లో పడొద్దని మహిళలకు సూచించారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే అయ్యన్నపాత్రుడు చేయలేని పనులు తాను చేస్తుంటే ఎన్నో అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో మెయిన్ రోడ్డును విస్తరించాలనే సాహసోపేతమైన నిర్ణయాన్ని ప్రజలు అభీష్టం మేరకు తీసుకున్నానని చెప్పారు. రూ.6 కోట్లతో చేపట్టిన ప్రత్యామ్నాయ రోడ్డు దాదాపు పూర్తికావస్తోందన్నారు.

మరోసారి జగనన్నను సీఎం చేసుకుందాం

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. గత ప్రభుత్వంలో ఏదైనా పనికావాలంటే మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఉన్న ఊరులోనే గ్రామ సచివాలయాలను, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను అందిస్తున్నామన్నారు. ఒక్కో పింఛన్‌దారుడుకి టీడీపీ ప్రభుత్వం 60 నెలలో రూ.63 వేలు ఇస్తే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1,48,500 ఇచ్చామన్నారు. రైతు భరోసా కింద 38,393 మంది రైతులకు రూ.168 కోట్ల లబ్ధి చేకూరిందని చెప్పారు. అమ్మ ఒడి ద్వారా 27 వేల మంది విద్యార్థులకు రూ.148 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు మొదలగు అనేక పథకాల ద్వారా ప్రజలకు ఎంతో లబ్ధి చేకూర్చామని వివరించారు. పైసా అవినీతి లేకుండా నేరుగా మీ ఖాతాల్లోకి నగదు జమ చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, కౌన్సిలర్లు మాకిరెడ్డి బుల్లిదొర, సిరసపల్లి నాని, వీరమాచినేని జగదీశ్వరి, దాడి కృష్ణవేణి, పార్టీ టౌన్ అధ్యక్షులు ఏకా శివ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషా బేగం, కర్రి శ్రీనివాసరావు, మెప్మా పీడీ సరోజని, పార్టీ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

గ్రామాల్లోనే అన్ని ప్రభుత్వ సేవలు

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- హెల్త్ సెంటర్, సచివాలయ భవనాల ప్రారంభోత్సవం


లక్కవరంలో హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


అంబేడ్కర్, జగ్జీవన్‌రావ్ విగ్రహాల పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం: గ్రామాల్లోనే అన్ని ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. లక్కవరం, సింహాద్రిపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన హెల్త్ సెంటర్ భవనాలు, భోగాపురంలో గ్రామ సచివాలయ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. చోడవరం ఇందిరా కాలనీలో స్థానిక యువకులు సహకారంతో నిర్మించ తలపెట్టిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల పనులకు ధర్మశ్రీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్‌లో ప్రతి గ్రామంలోనూ హెల్త్ సెంటర్లను ప్రభుత్వం నిర్మించి, వాటి ద్వారా ప్రజలకు వైద్య సేవలందిస్తోందన్నారు. ప్రజలు సకాలంలో సేవలు పొందేలా సచివాలయ వ్యవస్థను తీర్చిదిద్దడంతో దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు పూర్తిగా మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్‌లు బండి నూకాలమ్మ శ్రీను, శీరంరెడ్డి శ్రీనివాసరావు, దంతులూరి శ్రీనివాసరాజు, ఎంపీటీసీలు అరుణ, కోటి భూలోక, పాట్నూరి అప్పారావు, ఎంఆర్‌పీఎస్ నాయకులు చిన్నం నాగరాజు, కండెల్లి నరసింగరావు, కండెల్లి వెంకటరావు, మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూర్తా శ్రీనివాసరావు, రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రతినిధి వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు వేచలపు ప్రకాష్, మండల అధ్యక్షుడు గాడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో చేరువైన పాలన


జి.కోడూరులో రామాలయ శంకుస్థాపనలో ఎమ్మెల్యే గణేష్, నేతలు


పైడిపాలలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

మాకవరపాలెం: ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చినట్టు నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మండలంలోని జి.కోడూరు, జి.వెంకటాపురం, పాపయ్యపాలెం, పైడిపాల గ్రామాల్లో రూ.1.5 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించిన రెండు విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు, ఒక సచివాలయం, మూడు రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. జి.కోడూరులో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ అన్ని రకాల సేవలను గ్రామస్థాయిలోనే ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలెవరూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం లేకుండా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ..

మండలంలోని భీమబోయినపాలెం వద్ద రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని, ఇది పూర్తయితే అత్యాధునిక వైద్య సేవలు అందుతాయని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రాజారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బొడ్డు గోవింద, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, డీసీసీబీ మాజీ డైరెక్టర్ భద్రాచలం, తూర్పు కాపు సంఘ అధ్యక్షుడు హరిబాబు, జి.కోడూరు, పైడిపాల, జి.వెంకటాపురం సర్పంచ్‌లు అమ్మాజీ లక్ష్మి, మేరీ, రుత్తల జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు కృష్ణప్రసాద్, పైల భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మా గాంధీ తీర్థం


కె.జె.పురంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సర్పంచ్ రమణబాబు తదితరులు


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో బుధవారం మహాత్మా గాంధీ తీర్థం ఘనంగా నిర్వహించారు. గాంధీ వీధిలోని జాతిపిత విగ్రహానికి గాంధీ ఉత్సవ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు దాడి రాము ఆధ్వర్యంలో సర్పంచ్ జామి రమణబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ త్యాగనిరతిని స్థానిక పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కాళ్ల అప్పలనాయుడు, దాడి రాము, విశ్రాంతి ఉపాధ్యాయులు కాళ్ల అమ్మతల్లి నాయుడు వివరించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలతోపాటు సైకిల్ స్పీడ్, స్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భీశెట్టి జగ్గప్పారావు, స్థానిక నాయకులు మాలినాయుడు, మళ్ల కన్నబాబు, బి.జగ్గారావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు సూరిశెట్టి గోవిందరాజులు, ఆడారి వెంకట సూరిప్పారావు, ఆడారి శంకర్, స్థానికులు కె.రఘు, ఎం.వి.సత్యనారాయణ, కె.పి.ఎ.సత్యనారాయణ, ముచ్చకర్ల శ్రీను, బుడబండి రాజు, మాటూరి అప్పారావు, గణేశ్, పి.అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు.

గ్రామాల్లో సీతారాముల తీర్థాల సందడి

కె.కోటపాడు: మండలంలోని ఆర్లి, కొరువాడ గ్రామాల్లో బుధవారం సీతారాముల తీర్థ మహోత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. రెండు గ్రామాల్లోని సీతారాముల ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు చేశారు. స్నేహితులు, బంధువుల రాకతో గ్రామాలు సందడిగా మారాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

మాడుగుల రూరల్: కె.జె.పురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న 43 మంది 8వ తరగతి విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ మళ్ల కిశోర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణబాబు తదితరుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కాళ్ల అప్పలనాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టరు భీశెట్టి జగ్గప్పారావు, స్థానిక నాయకులు మళ్ల కన్నబాబు, ఎం.వి.సత్యనారాయణ, విశ్రాంతి ఉపాధ్యాయులు అమ్మతల్లి నాయుడు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు గోవిందరాజు, శంకర్, స్కూల్ కమిటీ సభ్యులు, పాఠశాల హెచ్‌ఎం వి.దాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కె.జె.పురం హైస్కూల్ విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న సర్పంచ్ రమణబాబు

ఉపాధ్యాయ వృత్తితో సమాజంలో గుర్తింపు

మాడుగుల రూరల్: ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో గుర్తింపునిస్తుందని, దీని ద్వారా ఎందరికో అక్షర జ్ఞానం ప్రసాదించిన వారమవుతామని నన్నయ్య విశ్వవిద్యాలయం మాజీ వీసీ ముర్రు ముత్యాలునాయుడు పేర్కొన్నారు. వీరనారాయణం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో బుధవారం సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడు పిళ్లా సూర్యప్రకాశ్‌రావు ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం బి.వి.జగన్నాథరావు(బాబి) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సూర్యప్రకాశ్‌రావు, ప్రశాంతి దంపతులను ఉపాధ్యాయ సంఘాలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తితోపాటు సాకేత్ ఫౌండేషన్ ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహించి సేవలందించారని సూర్యప్రకాశ్‌రావును కొనియాడారు. మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, సర్పంచ్ యల్లపు కొండప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు దాడి నూకరత్నం, స్కూల్ కమిటీ చైర్మన్ మల్లేశ్వరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి విస్సారావు రామారావు, మాజీ సర్పంచ్ సత్యంబాబు, మాడుగుల మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గ్రామస్తులు వారిని సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.


సూర్యప్రకాశ్‌రావు దంపతులను సన్మానిస్తున్న మాజీ వీసీ ముత్యాలునాయుడు తదితరులు

సంక్రమిత వ్యాధులపై అవగాహన అవసరం


విద్యార్థినులకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాఘవమ్మ

చీడికాడ: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన అవసరమని పెదగోగాడ పశు వైద్యురాలు డాక్టర్ రాఘవమ్మ అన్నారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని జి.కొత్తపల్లి కస్తూరిబా గాంధీ విద్యాలయంలో బుధవారం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వివిధ రకాల వ్యాధులు, పెంపుడు జంతువులను సాకడం, వాటి నుంచి వచ్చే ముప్పుపై వివరించారు. వ్యాధులు సక్రమించకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

యుద్ధప్రాతిపదికన ‘నాడు–నేడు’ పనులు

నాతవరం: నాడు–నేడు కార్యక్రమ నిధులతో పాఠశాలలో చేపడుతున్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎంఈవో తాడి అమృత్‌కుమార్ ఆదేశించారు. సీఆర్పీలు, ఉపాధ్యాయులతో బుధవారం తన కార్యాలయంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు–నేడు రెండో విడతలో 25 పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం రూ.12.65 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. పెద జగ్గంపేట పాఠశాలలో సాంకేతిక లోపం కారణంగా పనులు జరగలేదని, మిగతా చోట్ల పనులు వివిధ దశలో జరుగుతున్నాయన్నారు. నిబంధనల ప్రకారం పనులు చేసిన వాటికి సుమారుగా రూ.3.80 కోట్లకు పైగా బిల్లులు చెల్లించినట్లు చెప్పారు. నాడు–నేడు పనులతోపాటు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై నిర్లక్ష్యం చేయరాదని హెచ్‌ఎం, సీఆర్పీలకు సూచించారు. ప్రభుత్వం నుంచి కొత్తగా వచ్చిన ఆదేశాల ప్రకారం పాఠశాలలోనే విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో–2 కామిరెడ్డి వరహాలబాబు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సీఆర్పీలకు సూచనలిస్తున్న ఎంఈవో తాడి అమృత్‌కుమార్

ఎన్ఎంఎంఎస్‌కు మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక


ఎంపికైన 11 మంది విద్యార్థులతో ప్రిన్సిపాల్ సంధ్య, ఉపాధ్యాయులు

నర్సీపట్నం: ఎన్ఎంఎంఎస్ ప్రతిభా పరీక్షల్లో వేములపూడి మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న 11 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు. 2023 డిసెంబర్‌లో జరిగిన మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు అర్హత సాధించారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ వస్తుందని ప్రిన్సిపాల్ చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

కంప్యూటర్, విద్యా సామగ్రి వితరణ

నాతవరం: తన కుమారుడి జన్మదినం సందర్భంగా విద్యార్థుల కోసం అప్పలనాయుడు కుటుంబ సభ్యులు కంప్యూటర్, స్టడీ మెటీరియల్‌ను అందించడం ఆనందదాయకమని చమ్మచింత శ్రేయోభిలాషి సేవా సంస్థ వ్యవస్థాపకుడు నానాజీ అన్నారు. మండలంలోని చమ్మచింత గ్రామంలో చదువుకున్న విద్యార్థులంతా కలిసి ఈ సంస్థను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ చెబుతున్నారు. నానాజీతో కలిసి చదువుకున్న కోటవురట్ల మండలం పాములవాకకు చెందిన రంభా అప్పలనాయుడు సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిర పడ్డాడు. నానాజీ చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి బుధవారం తన కుమారుడు విశ్రుత్ జన్మదినం సందర్భంగా అప్పలనాయుడు దంపతులు ట్యూషన్ సెంటర్‌కు ఉచితంగా కంప్యూటర్ ఇచ్చారు. చమ్మచింత ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. తన కుమారుడి జన్మదినం రోజున పేద విద్యార్థులకు వితరణ చేయడం సంతోషంగా ఉందని అప్పలనాయుడు అన్నారు. సేవా సంస్థ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


విద్యార్థుల కోసం కంప్యూటర్ అందిస్తున్న అప్పలనాయుడు కుటుంబ సభ్యులు

హోమియోతో ప్రమాదకర వ్యాధుల నివారణ

అనకాపల్లి: హోమియో వైద్యం ద్వారా ప్రమాదకరమైన వ్యాధులను నివారించవచ్చని ఏఎంఏఎల్ కళాశాల విశ్రాంతి లెక్చరర్ కొయిలాడ రామ్మోహనరావు అన్నారు. కోటపర్తి అప్పారావు ఉపాధ్యాయ భవనంలో బుధవారం భారతి వికాస్ పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. హోమియో వైద్యంతో క్యాన్సర్ నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టాలో వివరించారు. ముందుగా రామ్మోహనరావును పరిషత్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

‘పది’లో సత్ఫలితాలకు తల్లిదండ్రుల సహకారం

రోలుగుంట: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన కోసం విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ప్రసాదరావు కోరారు. పాఠశాలలో బుధవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం అవసరమైన దుస్తులు, పాఠ్య పుస్తకాలు మొదలగునవి ఉచితంగా అందిస్తోందన్నారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి పైసా ఖర్చు లేకుండా నిష్ణాతులతో నాణ్యమైన విద్యనందిస్తోందని చెప్పారు. వారానికి, నెలనెలా పరీక్షలు నిర్వహించి విద్యార్థులు నేర్చుకున్న విషయాలను తెలుసుకుని, వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి పరీక్షల కోసం స్పెషల్ క్లాసుల నిర్వహణకు చర్యలు చేపట్టామని, అందుకు మీ వంతుగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాని విద్యార్థుల తల్లిదండ్రులను హెచ్‌ఎం కోరారు. ఇంటికి వచ్చిన తరువాత పిల్లలు నేర్చుకున్న విషయాలను అడిగి తెలుసుకొని ఒక గంట చదివిస్తే ఆశించిన ఫలితాలు సాధించవచ్చన్నారు.


విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం ప్రసాద్‌రావు

ఈ క్రాప్ నమోదు చేస్తేనే ప్రభుత్వ రాయితీలు

మాడుగుల: రబీ పంటలకు సంబంధించి సకాలంలో ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని, దానితోనే ప్రభుత్వ రాయితీలు ముడిపడి ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు అన్నారు. మాడుగుల, కేజేపురం గ్రామాల్లో ఈక్రాప్ నమోదు జరుగుతున్న తీరును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ నెల 15తో రబీ పంట కాలానికి ఈ క్రాప్ నమోదు గడువు పూర్తవుతుందన్నారు. ప్రభుత్వం రాయితీపై నాణమైన విత్తనాలు అందజేయాలన్నా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే ఆ పరిహారం రైతులకు అందజేయాలన్నా, పండిన పంటలు రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించాలన్నా ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా ఉండాలన్నారు. పంట పొలాల్లో తిరిగి ఈ క్రాప్ నమోదు ఉపయోగాలు, పెసర, మినప పంటలకు సోకే తెగుళ్ల నివారణపై రైతులకు వివరించారు. అనంతరం మాడుగుల అగ్రీ ల్యాబ్ పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు, వ్యవసాయ విస్తరణాకారి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు బీశెట్టి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గోవింద్ పాల్గొన్నారు.


మినప చేలులో రైతులకు తెగుళ్ల నివారణ చర్యలు వివరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

క్లుప్తంగా

జూనియర్ కళాశాల వార్షికోత్సవ సందడి


డ్యాన్స్‌తో అలరిస్తున్న విద్యార్థినులు

గొలుగొండ: కృష్ణదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కాలేజీలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో సుమారుగా 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. కళాశాల యాజమాన్యం నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు క్రీడలు, ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అప్పలనాయుడి మృతి తీరని లోటు


అప్పలనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు: వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ తండ్రి అప్పలనాయుడు మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన అప్పలనాయుడు సంతాప కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద ఎంపీపీ జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజుతోపాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

‘ఆడుదాం ఆంధ్రా’లో గురుకుల విద్యార్థుల ప్రతిభ


ఖోఖోలో విజయం సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి

నర్సీపట్నం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీల్లో నర్సీపట్నం మండలం తరపున ఎంజేపీ ఏపీ బీసీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు పి.కుశ్వంత్, ఆర్.ఓం ప్రకాష్ పాల్గొని తృతీయ స్థానం సాధించారు. విశేష ప్రతిభ చూపిన ఇద్దరు క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.రమేష్‌ను బుధవారం ప్రిన్సిపాల్ ఎన్.వెంకటరెడ్డి అభినందించారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

రావికమతం ఎంపీడీవోగా భానోజీరావు


బాధ్యతలు చేపట్టిన భానోజీరావు

రావికమతం: రావికమతం ఎంపీడీవోగా హెచ్.భానోజీరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన ఎంపీడీవో వెంకన్నబాబు శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. కోటవురట్ల మండల పరిషత్‌లో ఈవోపీఆర్‌డీగా బాధ్యతలు చేపడుతున్న భానోజీరావును ఇక్కడ పూర్తి అదనపు బాధ్యతలతో ఎంపీడీవోగా నియమించారు.

ఇంటింటా ప్రచారం

మాడుగుల రూరల్: ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా బుధవారం కె.జె.పురంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పడాల కొండలరావు ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ బుడబుండి రాజు, యువజన కాంగ్రెస్ కన్వీనర్ ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని దేవరాపల్లి ఎలక్ట్రికల్ ఏఈ కె.శంకరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల ఇంప్రూవ్‌మెంట్ పనుల నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలంతా గమనించి, సహకరించాలని కోరారు.